నేడు తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాలు



పూజలు చేస్తున్న కమిటీ ప్రతినిధులు

చార్మినార్: తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాల ఉత్సవాలను రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించడానికి డబీర్‌పురాకు చెందిన భక్తులు శనివారం తరలివెళ్లారు. ఈ మేరకు డబీర్‌పురాలోని పంచదుర్గ ఆలయానికి చెందిన కమిటీ ప్రతినిధులు ఘటం నాగేష్, పోతురాజ్ నర్సింగ్, లింగాల ప్రేమ్‌కుమార్, పి.ఆనంద్, నక్కా మహేందర్‌గౌడ్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాలను ఈ నెల 29, 30 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నామన్నారు.

గణనాథుడికి వెండి ఆభరణాల సమర్పణ



యాకుత్‌పురా: బోనాల ఉత్సవాల సందర్భంగా సుల్తాన్‌షాహి జగదంబ ఆలయంలోని వినాయకుడి విగ్రహానికి కిలోన్నర వెండితో రూపొందించిన కిరీటం, ఆభరణాల తొడుగులను సమర్పించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి అలంకరించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యు లు శశాంక్ తివారి, సుదర్శన్, వేణుగోపాల్, వరదరాజు, రామాచారి, కృష్ణముదిరాజ్ పాల్గొన్నారు.

అలంపూర్‌కు బయలుదేరిన ఆలయ కమిటీ ప్రతినిధులు



గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అలంపూర్ జోగులాంబ ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించేందుకు శనివారం సాయంత్రం గౌలిపురా మురాద్‌మహల్‌లోని మహంకాళి నల్ల పోచమ్మ ఆలయం ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు అలంపూర్ జోగులాంబ ఆలయానికి బయలుదేరి వెళ్లారు. ఆదివారం ఉదయం డప్పు చప్పుళ్లు.. పోతురాజుల నృత్యాల మధ్య అమ్మవారికి జోగులాంబ ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నామని తెలిపారు.

అలరించిన లతా మంగేష్కర్ సినీ గీతాలాపన



సుల్తాన్‌బజార్: ప్రముఖ సినీ నేపథ్య గాయని లతా మంగేష్కర్ చిత్ర గీతాలతో గాయకులు నిర్వహించిన భార్గవి నిషా 13వ మ్యూజికల్ ఈవెంట్ నిర్వాహకురాలు భార్గవిసోని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మ్యూజికల్ ఈవెంట్‌లో గాయని గాయకులు తమ మధురమైన కంఠంతో ఆలపించిన సినీ గీతాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ పోలీస్ అధికారి గడ్డం లాలయ్య చౌదరి, మాన్సింగ్, భీమ్‌రావు, శ్రీశైలం, సీతారామ్‌రెడ్డి, అర్చన, చందన, పుష్పలతను హాజరై ఈ కార్యక్రమాన్ని ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు.

బీబీకా అలావాను సందర్శించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా డబీర్‌పురా బీబీకా అలావాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ అన్నారు. డబీర్‌పురాలోని బీబీకా అలావాను శనివారం వారు సందర్శించి ఆలంలకు పూలు, దట్టీలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి వారు అలావాలో ఏర్పాట్లను పరిశీలించారు. మొహర్రం సంతాప దినాల్లో భాగంగా అలావాకు వచ్చే భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

పీవీ నర్సింహారావుకు ఘన నివాళి



అబిడ్స్: మాజీ దివంగత ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆలం భాస్కర్, కార్యదర్శి మనిలాల్‌షా, గణేష్ యాదవ్, ప్రేమలత అగర్వాల్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు ఆంధ్రలో తెలంగాణ బోనాలు

- అక్కన్న మాదన్న ఆలయం నుంచి విజయవాడకు బయలు దేరిన భక్తులు
- తెలుగు రాష్ట్రాలు చల్లంగా ఉండాలని కోరుతూ అమ్మవారికి పూజలు
- ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బోనాలు



బాజా భజంత్రీల నడుమ విజయవాడకు బయలు దేరిన పాతబస్తీ భక్తులు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 29న విజయవాడ కనక దుర్గా అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో పాతబస్తీలోని వివిధ ఆలయాలకు చెందిన ప్రతినిధుల బృందం ఈ బోనాల జాతర ఉత్సవాల్లో పాల్గొననున్నారు. తెలంగాణ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని హరిబౌలిలోని అక్కన్న మాదన్న ఆలయం నుంచి బాజా భజంత్రీలతో కళా బృందాలు, పోతరాజుల నృత్య ప్రదర్శనలతో దారిపొడవునా ఊరేగింపు నిర్వహించి విజయవాడకు బయలు దేరి వెళ్లారు. కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో శనివారం ముందుగా అక్కన్న మాదన్న ఆలయంలో అమ్మవారి వద్ద బంగారు పాత్ర నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విజయవాడ బయలు దేరి వెళ్లారు. ఆదివారం ఉదయం విజయవాడ బ్రహ్మణ వీధి నుంచి కనక దుర్గమ్మ ఆలయం వరకు కళా బృందాల నృత్య ప్రదర్శనలతో సామూహిక తెలంగాణ బోనాల ఊరేగింపు నిర్వహించనున్నారు.

ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని..

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో పాటు పాడి పంటలు పచ్చగా ఉండాలని కోరుతూ విజయవాడ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నామని రాఘవేందర్ తెలిపారు. ఇందులో భాగంగా ఈసారి కూడా బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు, కృష్ణానదిలో గంగా తెప్ప తదితర పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు. గంగ తెప్పకు పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి బంగారు పాత్రలోని నైవేద్యాన్ని సమర్పించనున్నామన్నారు. ఈసారి విజయవాడలో జరిగే బోనాల ఉత్సవాల్లో జోగిని శ్యామల బంగారు బోనాన్ని ఎత్తనున్నారన్నారు.



గోల్కొండ అమ్మవారికి మొదటి బంగారు బోనం ఎత్తిన జోగిని నిషా క్రాంతి



జోగిని శ్యామల



జోగిని అవిక

బంగారు బోనానికి భక్తుల ఆదరణ..

బోనాల ఉత్సవాల్లో బంగారు బోనానికి భక్తుల ఆదరణ ఎక్కువగా ఉంది. సప్త మాతృకలకు సప్త బంగారు బోనం సమర్పించే సమయాల్లో భక్తులు అత్యధికంగా ఆయా అమ్మవారి ఆలయాలకు చేరుకుని నిష్ఠగా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా బంగారు బోనమెత్తే జోగినిలపై భక్తిశ్రద్ధలను చూపుతారు. ప్రతి ఏడాది పాతబస్తీ నుంచి ఏడు ఆలయాల అమ్మవార్లకు ఏడు బంగారు బోనాలను సమర్పిస్తూవస్తున్నారు నిర్వాహకులు.

ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో..

భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జోగిని నిషా క్రాంతి బంగారు బోనాలను ఎత్తుకోగా..ఈసారి ఆమెతో పాటు జోగిని శ్యామల, అవిక కూడా బంగారు బోనాన్ని ఎత్తి భక్తులను అలరించనున్నారు. ఈసారి జోగిని నిషా క్రాంతి గోల్కొండ, సికింద్రాబాద్, బల్కంపేట అమ్మవార్లకు జోగిని శ్యామల విజయవాడలో జరిగే తెలంగాణ బోనాల్లో బంగారు బోనాన్ని ఎత్తనుండగా.. మరో జోగిని అవిక పెద్దమ్మ తల్లి, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి, లాల్‌దర్వాజ సింహవాహిణి అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించనున్నారు. ఈ నెల 26న జరిగిన బోనాల జాతరలో మొదటి బంగారు బోనాన్ని గోల్కొండ జగదాంబిక అమ్మవారికి జోగిని నిషా క్రాంతి నిర్వాహకుల ద్వారా సమర్పించారు. మరో జోగిని శ్యామల ఈ నెల 29న విజయవాడలో బంగారు బోనమెత్తనున్నారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై ఆయన వారితో చర్చించారు. హకీంపేట్ కుంట, టోలిచౌకీ, ప్యారమౌంట్ కాలనీ తదితర ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరచూ ట్రిప్ అవుతుందని వీటికి శాశ్వత పరిష్కారం చూడాలన్నారు. టోలిచౌకీ నిజాం కాలనీ, మెరాజ్ కాలనీల్లో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని దీనిపై తాను గతంలో కూడా అధికారుల దృష్టికి తీసుకొచ్చానన్నారు. అయినా సమస్య అలాగే ఉందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని అధికారులు తమవంతు బాధ్యతగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, డీఈ సుధీర్, ఏఈ యూసుఫ్‌బాబా తదితరులున్నారు.


బల్కంపేట ఎల్లమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక తరపున బల్కంపేట ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనందంగా ఉందని గోల్కొండ జగదాంబిక ఆలయం పని వృత్తి వార్ల అధ్యక్షుడు తంగడపల్లి శివశంకర్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మకు గోల్కొండ ఎల్లమ్మ పసుపు బండారి, పట్టువస్త్రాలు శనివారం సమర్పించారు. ఇందులో భాగంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. దేవాదాయశాఖ ఈఓ వసంత, సలహాదారు నర్సింగ్‌రావు, సాయిబాబా చారి, శంకర్, సుధీర్, డప్పు రవి, అశోక్, శ్రవణ్ పాల్గొన్నారు.



బల్కంపేట ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఈఓ వసంత, శివశంకర్ తదితరులు

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తదితరులు

గౌలిపురా: ప్రాణపాయ స్థితిలో వ్యక్తిని కాపాడేందుకు రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం తలాబ్‌కట్టా చాచా గ్యారేజీ సమీపంలో తలసేమియా బాధపడుతున్న రోగులకు రక్తాన్ని అందించేందుకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌స్పెక్టర్ బాలస్వామి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో పలువురు పాల్గొని రక్తదానం చేశారు.

'విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చొద్దు'

గోల్కొండ: ప్రైవేటు పాఠశాలల వారు విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చొద్దని గోల్కొండ జోన్ డిప్యూటీ ఈఓ బి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫీజు భారంతో ఏ ఒక్క విద్యార్థి కూడా మధ్యలో చదువు ఆపకూడదన్నారు. విద్యా హక్కు చట్టాన్ని కాలరాయకుండా పాఠశాలల యాజమాన్యాలు పక్కా చర్యలు తీసుకోవాలన్నారు. టోలిచౌకీలోని సక్సెస్ స్కూల్‌లో ఆయన ప్రతి తరగతి గదిని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సిబ్బంది నజీర్, తిరుపతి తదితరులున్నారు.



టోలిచౌకీలో ప్రైవేటు పాఠశాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఈఓ వెంకటేశ్వర్లు



డ్రైనేజీ పూడికతీత పనులు ప్రారంభం

గోల్కొండ: బోనాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గుడిమల్కాపూర్ డివిజన్‌లో అన్ని అభివృద్ధి పనులు చేయిస్తున్నామని డివిజన్ అధ్యక్షుడు దేవరవంశీ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లో డ్రైనేజీ పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట ముఖేష్‌సాగర్, సందేశ్‌యాదవ్, సుధాకర్‌యాదవ్ తదితరులున్నారు.

మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వానపత్రం అందజేస్తున్న మహంకాళి ఆలయ కమిటీ ప్రతినిధులు

గోల్కొండ: హైదరాబాద్ బోనాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సబ్జిమండీ నటరాజ్‌నగర్ నల్లపోచమ్మ మహంకాళి ఉమ్మడి ఆలయ కమిటీ వారు శనివారం ఆమెను కలిశారు. ఆలయ 103 బోనాల ఉత్సవాలకు రావాల్సిందిగా మంత్రికి వారు ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోనాలు నిర్వహించే ఆలయ కమిటీలకు పూర్తిగా సహకరిస్తున్నామన్నారు. బోనాల నిర్వహించే వారికి ఆలయానికి త్వరలోనే చెక్కులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దొర్నల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, బి.గోపాల్, నందకిషోర్, రమేష్, పాపయ్య తదితరులున్నారు.

హత్య కేసులో ఆరుగురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ గోపి

చాంద్రాయణగుట్ట: ఆస్తికోసం తమ్ముడిని హత్య చేసిన కేసులో అన్న కుటుంబంలోని ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గోపి వివరాల ప్రకారం..బార్కాస్ సలాలకు చెందిన సయ్యద్ బిన్ అబూబకర్ బాపన్న కుమారుడు సాలం బిన్ సయ్యద్ బాపన్న(36) ఈ నెల 26న తన ఇంట్లో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. సయ్యద్ బాపన్న, అతని అన్న మోసిన్ బాపన్న(68)కు నడుమ 23 ఏళ్ల నుంచి ఇంటి వివాదం కారణంగానే హత్య చేసినట్లు పోలీసు విచారణలో తేలింది. 2002లో తండ్రి చిన్న కుమారుడికి రాసిచ్చిన ఇంట్లో తమకు కూడా వాటా కావాలని మోసిన్ కుటుంబం వాదిస్తూ వస్తుంది. ఈ విషయం సివిల్ కోర్టు వరకు వెళ్లింది. మే నెలలో తండ్రి చనిపోవడంతో, ఈ నెల 26వ తేదీనా 40 రోజుల కార్యం(చహలూమ్) నిర్వహించారు. వాటా ఇచ్చేందుకు సాలం ససేమిరా అనడంతో ముందస్తు ప్రణాళికలో భాగంగా అతని ఇంట్లోకి గోడ దూకి వెళ్లి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం మోసిన్ బాపన్నతో పాటు అతని నలుగురు కుమారులు సాలె బాపన్న(31), అబ్దుల్లా బాపన్న(27), అబూద్ బాపన్న(26), నాసర్ బాపన్న(33), మోసిన్ బాపన్న భార్య షహనాజ్ బేగం(55) గొంతుకోసి కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసి పరారయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి కత్తులు, యాక్టివా, స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. యాగం సందర్భంగా భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే ఈ మహాయాగం 21 రోజుల పాటు కొనసాగనుంది. వచ్చే నెల 18వ తేదీ వరకు ఈ మహాయాగాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం గురుదేవతా ప్రార్థన, గణపతి పూజ, పుణ్య హవచనం, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారి భక్తులు, ఆలయ కమిటీ కార్యదర్శి కాట రమేష్ దంపతులు ఈ మహాయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మహంకాళేశ్వరి మహాభిషేకం వైభవంగా జరిగింది. 108 ఆయుర్వేద, సుగంధ ద్రవ్యాలు, పళ్లు, ఫలాలు, కలశాలతో అమ్మవారికి మహాభిషేకం పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



ధ్వాజారోహణం చేస్తున్న రమేష్ దంపతులు

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలి

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని అన్ని ఆలయాల వద్ద బోనాల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ చాంద్రాయగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ కోరారు. శనివారం ఆయన సర్కిల్–8 ఈఈ సలావుద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బోనాల అభివృద్ధి పనులు పండుగ లోపు పూర్తి చేశాకే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని, ముందే చెల్లిస్తే పనులను పెండింగ్‌లో పెడుతున్నారన్నారు. దీంతో పాటు రియాసత్‌నగర్, కంచన్‌బాగ్, చాంద్రాయణగుట్ట, బార్కాస్ డివిజన్లలో బోనాల నిధులను ఆలయాలకు సంబంధం లేని చోట్ల వెచ్చించడం తగదన్నారు. ఆయనను కలిసి వారిలో డివిజన్ల అధ్యక్షుడు ఎస్.రవి, రంజిత్, లక్ష్మణ్‌లున్నారు.



ఈఈకి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

అక్షరాభ్యాసం



జియాగూడ: నూతన విద్యా సంవత్సరంలో నర్సరీ చిన్నారులకు శాస్త్రోక్తంగా విద్యాభాసం చేయించి తరగతులకు ఆహ్వానించామని విద్యాశ్రీ స్కూల్ చైర్మన్ శ్యామ్‌వెరా అన్నారు. ప్రిన్సిపాల్ సునిత ఆధ్వర్యంలో శనివారం స్కూల్ ఆవరణలో నర్సరీ తరగతిలకు అడ్మిషన్ పొందిన చిన్నారుల కోసం సరస్వతి మాతకు పూజలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం శ్యామ్‌వెరా మాట్లాడుతూ..జియాగూడలో 36 ఏళ్లుగా స్కూల్‌ను కొనసాగిస్తున్నామన్నారు. నిరుపేదలకు విద్యను అందించాలని లక్ష్మీ భూమా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి 10 ఏళ్లుగా ఉచితంగా స్కాలర్‌షిప్‌లను అందజేయడంతో వేలాది మంది విద్యార్థులు విద్య లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

చార్మినార్: బోనాల ఉత్సవాల సందర్భంగా శనివారం మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో వీర హనుమాన్ భక్త సమాజం కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ బస్తీలో బోనాల ఉత్సవాల ప్రారంభానికి ముందు మీరాలంమండి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని కమిటీ ప్రతినిధులు ఎస్.సాయికుమార్, రాంకుమార్, సురేష్, చిన్న, జేరిపోతుల సాయి పవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యను ఘనంగా సన్మానించారు. మల్యాల మధుసూదన్‌యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న గాజుల అంజయ్య, మధుసూదన్ యాదవ్, హన్స్‌రాజ్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి




జగదీశ్వర్, ముజీబ్‌ను సత్కరిస్తున్న రాజ్‌కుమార్, భాస్కర్

అబిడ్స్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేని అన్నారు. విద్యాశాఖలో పలువురు ఉద్యోగులకు పదోన్నతి రావడంతో టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు భాస్కర్, కోశాధికారి పవన్ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జగదీశ్వర్, ముజీబ్ మాట్లాడుతూ..పలు ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలన్నీ చీఫ్ సెక్రెటరి రామకృష్ణారావు, సీఎం రేవంత్‌రెడ్డి ఇతర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయంత్‌రెడ్డి, రవి, ప్రియ, రమేష్, సుదర్శన్, శ్రీనివాస్‌బాబు, అరుణజ్యోతి, అహ్మద్, మధు, వినోద్ కుమార్, పరమేష్, దామోదర్ పాల్గొన్నారు.

'వెన్నెల గింజలు' పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత చిట్టిప్రోలు సుబ్బారావు రచించిన 'వెన్నెల గింజలు'పుస్తకావిష్కరణ సభ శనివారం సైఫాబాద్‌లోని ఆఫీసర్స్ కాలనీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. వివిధ అంశా ల పై రచయిత రాసిన కవితా సంకలనాలు ఎంతో బాగున్నాయని కొనియాడారు. అంతకు ముందు ప్రముఖ నాట్య గురువు ఉష గాయత్రి పర్యవేక్షణలో నిర్వహించిన అమృతోత్సవ భారతి కూచిపూడి నృత్య రూపకం ఆహుతులను ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు కేవీ.రమణాచారి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఎంఎస్‌కో సంపాద కులు దుర్గంపుడి చంద్రశేఖర్‌రెడ్డి, రచయిత బీరం సుందరరావు, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఎన్‌వి. శ్రవణ్‌కుమార్, కేవీ.రమణాచారి తదితరులు

కళలతో మానసికోల్లాసం



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మామిడి హరికృష్ణ, ప్రిన్సిపాల్ ఎంఎల్.ఆంనద్‌రావు తదితరులు

విజయనగర్‌కాలనీ: కళలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎంఎల్.ఆనంద్‌రావు అన్నారు. సుచేత ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వారి ఆధ్వర్యంలో శనివారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రదర్శనలో కొలువైన చిత్రాల్లో జీవం ఉట్టిపడుతుందని అభినందించారు. డాక్టర్ శివనాగిరెడ్డి, సుచేత, మల్లేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికత సమాజ అవసరాలకు అనుగుణంగా ఉండాలి

గన్‌ఫౌండ్రీ: ఆధునిక సాంకేతిక విప్లవంలో విద్యార్థులు సమాజ మార్పులకు అనుగుణంగా తమతమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ రిసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్.శివరామకృష్ణ పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రీ చాపల్‌రోడ్డులోని స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్ ఎక్స్‌పోలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇంజనీరింగ్ అంటే కేవలం పుస్తకాల చదువుతో ముగిసిపోయేది కాదని మన ఆలోచనలు, ఆవిష్కరణ సామర్థ్యాన్ని సమాజ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక విద్యారంగంలో రాణించాలన్నారు. కళాశాల కార్యదర్శి కె.కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజాన్ని ముందుకు తీసుకువెళ్లేలా తమ కళాశాలల్లో విద్యార్థులను సాంకేతిక ఆధునిక రంగంలో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు పి.రాకేష్ రెడ్డి, ఆర్.ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్లు, వి.అనురాధ, డాక్టర్ సత్యప్రసాద్ లంకా, ప్రిన్సిపల్ డాక్టర్ బీఎల్‌రాజు, డీన్ ప్రొఫెసర్ వినయ్‌బాబు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ.రమేష్, అధ్యాపకులు నర్సింహా, ఆర్.గంగాదర్, జేపీ.ప్రమోద్, వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న శివరామకృష్ణ,కృష్ణారావు